

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 25-01-2026 | సంపుటి - 26 | సంచిక -246 | రూ : 4 | పేజీలు: 8





2లో

## 'టీ హబ్'పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- టీ హబ్‌ను స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని సీఎం ఆదేశం
- ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి
- అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు
- టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దని స్పష్టం చేసిన సీఎం

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి




2లో

## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

- గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు వ్యాపించిన మంటలు
- రోబో ఫైర్ మిషన్ ద్వారా మంటలు ఆర్పుతున్న సిబ్బంది
- ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్న సిబ్బంది




2లో



2లో

## అన్నవరం ప్రసాదం కౌంటర్ లో ఎలుకలు ఇద్దరిపై వేటు



2లో

## కిటకిటలాడుతున్న తిరుమల..

### సర్వదర్శనానికి 24 గంటలు

- శ్రీవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- నిన్న స్వామిని దర్శించుకున్న 69,726 మంది భక్తులు

## షోరూమ్‌లోనే వాహన రిజిస్ట్రేషన్.. తెలంగాణలో నేటి నుంచి కొత్త విధానం

- వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకపై ఉండదు
- ద్విచక్ర వాహనాలు, కార్లకు మాత్రమే ఈ కొత్త విధానం వర్తింపు
- రవాణా వాహనాల రిజిస్ట్రేషన్‌లు పాత పద్ధతిలోనే కొనసాగింపు



2లో


భారత ఎన్నికల సంఘం

16వ జాతీయ ఓటర్ల దినోత్సవం-2026 "వేడుకలు"

తేది: 25 జనవరి 2026

రవీంద్ర భారతి, హైదరాబాద్

ఉ॥ 11:00 గంటల నుండి

ముఖ్య అతిథి

శ్రీ జిష్ణు దేవ్ వర్మ

గౌ॥ గవర్నర్, తెలంగాణ

గౌరవ అతిథి

శ్రీమతి ఐ. రాణి కుముదిని ఐ.ఎ.ఎస్, (Retd.)

రాష్ట్ర ఎన్నికల కమీషనర్, తెలంగాణ

ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఓటరు ప్రతిజ్ఞతో భాగస్వాములవ్వండి

వేడుకలు

దేశ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో

QR కోడ్ స్కాన్ చేసి ఓటరు ప్రతిజ్ఞ చేయండి

ఈ QR కోడ్ స్కాన్ చేయడం ద్వారా మరియు #VoteForSureని మీ సోషల్ మీడియా హ్యాండిల్స్ లో షేర్‌చేయడం ద్వారా భాగస్వాములవ్వండి.

ఓటు

V.O.T.E

"నా భారతదేశం, నా ఓటు"

భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు

ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ

Follow us on: CEOTelangana CEO_Telangana CEOTelangana ChiefElectoralOfficerTelangana

For Details: Voters.eci.gov.in / or Call 1950 or Download Voter Helpline App

# నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు: సీఎం చంద్రబాబు

చిత్తూరు : చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గాన్ని తన సొంత నియోజకవర్గమైన కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా పరిశ్రమలను తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. శనివారం నగరిలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు. నగరితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, "నగరి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. నా మిత్రుడు, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఈ ప్రాంత ప్రజల కోసం నిరంతరం తపించేవారు. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి" అని వ్యాఖ్యానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను కూడా సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం రూపొందించిన 'స్వచ్ఛ రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మెప్మా, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పలువురిని సన్మానించారు. "స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మనందరి జీవన విధానం కావాలి. ఏడాది క్రితం ఒక ఉద్యమంలా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం నేతలు, అధికారులు పాల్గొంటున్నారు. ప్రజలంతా భాగస్వాములైతేనే దీని లక్ష్యం నెరవేరుతుంది" అని పిలుపునిచ్చారు. సమైక్యాంధ్రలో సీఎంగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన జన్మభూమి, పచ్చదనంపరిశుభ్రత కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్: నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ దుకాణంలో మంటలు చెలరేగి నాలుగో అంతస్తు వరకు వ్యాపించాయి. ప్రమాదం మొదట గ్రౌండ్ ఫ్లోర్‌లో సంభవించి, ఆపై నాలుగు అంతస్తులకు విస్తరించింది. రోబో ఫైర్ మిషన్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనా స్థలానికి భారీ క్రేన్లు చేరుకున్నాయి. భవనం లోపల ఇద్దరు చిన్నారులు, నలుగురు పెద్దలు చిక్కుకున్నట్లు సిబ్బంది గుర్తించారు. స్కైలాడర్ ద్వారా నాలుగో అంతస్తు అద్దాలను పగులగొట్టి వారిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవనం పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు ఖాళీ చేయించారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఫర్నిచర్ దుకాణంలోని సెల్లార్‌లో ఫర్నిచర్ నిల్వ ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్నారు. అగ్ని ప్రమాద ప్రాంతంలో పోలీసులు, హైడ్రా సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలంలో అంబులెన్సులు అందుబాటులో ఉంచారు. ప్రమాద తీవ్రతను పెంచే వస్తువులను అక్కడి నుంచి తరలించారు.

## అన్నవరం ప్రసాదం కౌంటర్ లో ఎలుకలు... ఇద్దరిపై వేటు

అన్నవరం: అన్నవరం దేవస్థానం ప్రసాదం మరోసారి వివాదాల చుట్టూ తిరుగుతోంది. ఇటీవల ప్రసాదంలో నత్త ఉందంటూ ఓ జంట చేసిన హంగామా ఇంకా చల్లారకముందే, ఇప్పుడు ప్రసాదం కౌంటర్ వద్ద ఎలుకల హల్‌చల్ కొత్త దుమారాన్ని లేపింది. ఇటీవల అన్నవరం హైవేపై ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్‌లో ప్రసాదం బుట్టల మధ్య ఎలుకలు పరుగులు తీస్తూ తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి. వాటిని వీడియోగా తీసిన ఓ భక్తుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం క్షణాల్లో వైరల్ అయ్యింది. ఇప్పటికే ప్రసాదం పరిశుభ్రతపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ వీడియో రావడంతో భక్తుల్లో ఆందోళన మరింత పెరిగింది. ఈ ఘటనపై భక్తులు అక్కడే ఉన్న సిబ్బందిని ప్రశ్నించగా.. "కొనాలంటే కొనండి.. లేకపోతే వెళ్లిపోండి" అన్నట్టుగా నిర్లక్ష్యంగా స్పందించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం కాస్తా దేవస్థానం అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు సీరియస్‌గా స్పందించారు. వెంటనే ఘటనపై అంతర్గత విచారణ చేపట్టిన అధికారులు, పర్యవేక్షణ లోపం ఉందని తేల్చారు. బాధ్యతారహితంగా వ్యవహరించారని నిర్ధారించడంతో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు భక్తులకు హామీ ఇచ్చారు.

### కిటకిటలాడుతున్న తిరుమల..
## సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల : కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కొలువుదీరిన పుణ్యక్షేత్రం తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో తిరుమల జనసంద్రంగా మారింది. కొండపై ఉన్న అన్నికంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. మరోవైపు, స్వామి వారిని నిన్న 69,726 మంది భక్తులు దర్శించుకున్నారు. మొత్తం 27,832 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల రూ. 4.12 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది.

## షోరూమ్‌లోనే వాహన రిజిస్ట్రేషన్..
## తెలంగాణలో నేటి నుంచి కొత్త విధానం అమలు

హైదరాబాద్: తెలంగాణలో వాహన కొనుగోలుదారులకు ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పనున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఇకపై వాహనం కొనుగోలు చేసిన డీలర్ పాయింట్ వద్దే శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తిచేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ విధానం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు వాహనదారులకు వేగంగా సేవలు అందనున్నాయి. వాహనదారులకు సౌలభ్యం కల్పించే ఉద్దేశంతో ఈ నెల 8న రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ శ్రీకృష్ణ ఆటోమోటివ్స్ షోరూమ్‌లో ఈ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో సంయుక్త రవాణా కమిషనర్ (జేటీసీ) మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ స్వయంగా వాహనదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు.

**కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ ఇలా..**

నూతన విధానం ప్రకారం, వాహనం కొనుగోలు చేసిన తర్వాత డీలరే రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారు. ఇన్వాయిస్, ఫారం 21, ఫారం 22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వాహన ఫొటోలు వంటి అవసరమైన పత్రాలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, వెంటనే రిజిస్ట్రేషన్ నంబరు కేటాయిస్తారు. ఉదయం వాహనం కొంటే సాయంత్రంలోగా, సాయంత్రం కొంటే మరుసటి రోజు ఉదయంలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా వాహన యజమాని చిరునామాకు చేరుతుంది.

**వీటికి మాత్రమే వర్తింపు..**

అయితే, ఈ కొత్త విధానం కేవలం ప్రైవేట్ వాహనాలైన బైక్‌లు, కార్లకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. వాణిజ్య (ట్రాన్స్‌పోర్ట్) వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ యథావిధిగా ఆర్టీఓ కార్యాలయాల్లోనే కొనసాగుతుంది. ఈ విధానం అమలులో పారదర్శకత కోసం అవసరమైతే డీలర్ల షోరూమ్‌లలో తనిఖీలు నిర్వహిస్తామని రవాణా శాఖ తెలిపింది. ఈ నూతన విధానంపై రాష్ట్రంలోని 33 జిల్లాల అధికారులకు రవాణా శాఖ కమిషనర్ ఆన్‌లైన్ సమావేశం ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

## భారత్ పై తగ్గనున్న ట్రంప్ టారిఫ్ లు..!

అమెరికా: భారత్ పై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్ లు తగ్గించే యోచనలో ఉన్నట్లు అగ్రరాజ్యం సంకేతాలు వెలువరించింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నందుకు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రతీకార సుంకాలు 25 శాతం కలిపి మొత్తంగా మన దేశంపై 50 శాతం సుంకాలు విధించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తు సేవలపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. అయితే, ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించింది. దీంతో అమెరికా సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది: ప్రధాని మోదీ

ఢిల్లీ: భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## 'టీ హబ్'పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్: టీ హబ్‌ను ఒక ప్రత్యేక స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని, అందులోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌ల కోసం ఒక ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దాని స్వరూపాన్ని మార్చేలా ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచనలుంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. ఏ పరిస్థితుల్లోనూ టీ హబ్ ప్రాధాన్యతను తగ్గించవద్దని ఆయన స్పష్టం చేశారు.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్



హైదరాబాద్: ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కోకన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.



## స్టీల్ ప్లాంట్‌లో CISF సిబ్బంది తగ్గింపు..

విశాఖ స్టీల్ ప్లాంట్ లో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని ఇటీవల తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో కేంద్రంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివర్మ స్పందించారు. స్టీల్ ప్లాంట్ పై భారంగా తగ్గించేందుకే సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పై కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందన్నారు. ఏపీ ప్రజల సెంటిమెంట్‌ను దృష్టిలో పెట్టుకుని స్టీల్ ప్లాంట్ కు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించామని చెప్పారు. కేంద్రం పాలసీకి విరుద్ధమని తెలిసినా రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. నష్టాలు లేకుండా భవిష్యత్తులో స్టీల్ ప్లాంట్ సంవృద్ధిగా పని చేస్తోందనే నమ్మకం తమకుందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. రాబోయే మూడు నెలల్లో కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలు జరగబోతోన్నాయని, పొత్తులు అంశం అధిష్టానం పరిధిలో ఉందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.

### ఈసారి రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా
## యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్

ఢిల్లీ, జనవరి 24: భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆమెతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ఇరుపక్షాల సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఢిల్లీ విమానాశ్రయంలో ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద స్వాగతం పలికారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్యాలైన భారత్, ఈయూల మధ్య పరస్పర విశ్వాసం, భాగస్వామ్య విలువలతో బంధం బలపడుతోందని భారత విదేశాంగ శాఖ ఈ సందర్భంగా ఎక్స్ లో పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా ఈయూ విదేశాంగ విధాన చీఫ్ కజా కల్లాస్ కూడా ఢిల్లీకి వచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఈయూ నేతల పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. కొద్ది రోజుల క్రితం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈయూ దేశాల రాయబారులతో సమావేశమయ్యారు. బలమైన భారత్‌ఈయూ భాగస్వామ్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించగలదని, సరఫరా గొలుసులను పటిష్టం చేయగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు వస్తున్న ఈయూ నేతలు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవుతారు. జనవరి 27న జరగనున్న 16వ భారత్‌ఈయూ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య వాణిజ్యం, భద్రత, సాంకేతికత వంటి అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి.

# ధర్మోజి గూడెం అంగన్వాడిలో చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ


*** సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలోని అంగన్వాడి చిన్నారులకు సర్పంచ్ జువ్వి నర్సింహ్మా శనివారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీలో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా గర్భిణీలు, చిన్నారులు ఎంతమంది హాజరవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న భోజనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహార లోపం అధిగమించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా భోజనాన్ని అందిస్తున్నారు. అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచకొండ భార్గవ్, గునుగంటి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్వాడి పారిజాత తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యలగూడెంను నూతన మండలంగా ప్రకటించాలి

*** కొలను శ్రీనివాస్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చేనేత వస్త్రాలతో దేశవ్యాప్తంగా పేరున్న కొయ్యలగూడెం గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని అల్లాపురం మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికులకు నిలయంగా ఉన్న కొయ్యలగూడెం గ్రామానికి సరైన ప్రాధాన్యత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలతో దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న కొయ్యలగూడెం గ్రామానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం, దేవలమ్మ నాగారం, పీపల్ పహాడ్, అల్లాపురం, ఎనగంటి తండ, తుంబాయి తండ, రాచకొండ ఎల్లంబావి, ఎల్లగిరి, కైతాపురం, ధర్మోజి గూడెం, మల్కాపురం తుప్రాన్ పేట మొత్తం 16గ్రామపంచాయతీలను కలిపి నూతన మండలం ఏర్పాటు చేయాలని, నూతన మండలం గా కొయ్యలగూడెంను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలోనే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను త్వరలోనే కలిసి మెమోరాండం అందజేస్తామని తెలిపారు.

# అంగరంగ వైభవంగా రంగనాథ కళ్యాణోత్సవం

*** వేడుకల్లో పాల్గోన్న మంత్రి దామోదర రాజ నర్సింహ.**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోల్ లోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం భూనీళా సమేత శ్రీ గోదా రంగనాథ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గోన్నారు . సామాన్య భక్తులతో కలసి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ చిట్టిబాబు దంపతులు కల్యాణోత్సవంను జరిపించారు. మంత్రి శ్రీ రంగనాథ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు. వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం లో మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి నాయకులు సురేందర్ గౌడ్ , కృష్ణారెడ్డి , ఏ.చిట్టిబాబు ముదిరాజ్ ,రామకృష్ణ , ప్రవీణ్, మున్నూరు కిషన్ , ప్రదీప్ గౌడ్ లు పాల్గోన్నారు .

# యువత క్రీడల వైపు దృష్టి సారించాలి

*** మునుగోడు నియోజకవర్గం సన్సద్ కేల్ మహోత్సవ్ క్రీడోత్సవం ముగింపు**

**- బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యువత చిన్నతనం నుంచి క్రీడల వైపు దృష్టిసారించి.. క్రమశిక్షణతో కూడిన జీవిత ప్రయాణాన్ని సాగించాలని బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ సూచించారు. సన్సద్ కేల్ మహోత్సవ్ లో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామంలోనే ముస్కు మధుసూదన్ రెడ్డి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న మునుగోడు నియోజకవర్గ క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ లో తంగడపల్లి గ్రామానికి చెందిన ఆలె నాగరాజు ఫాలోవర్స్ వర్సెస్ కోటయ్య గూడెం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆలె నాగరాజు ఫాలోవర్స్ 10ఓవర్లకు గాను 86పరుగులు సాధించగా, కోటయ్యగూడెం జట్టు 9.3ఓవర్లలో 87పరుగులు చేసి విజయం సాధించింది. కోటయ్యగూడెం జట్టుకు ప్రథమ బహుమతి, ఆలే చిరంజీవి ఫాలోవర్స్ జట్టుకు ద్వితీయ బహుమతులు సాధించాయి. ముఖ్య అతిథిగా బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్లో క్రీడాకారులతో కలశాలనం చేశారు. అనంతరం గెలుపొందిన జట్లకు షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె లక్ష్మణ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడలు, యోగా చేస్తూ ఆరోగ్యకరమైన జీవితం వైపు అడుగులు వేయాలని సూచించారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయన్నారు. మునుగోడు నియోజకవర్గ క్రికెట్ పోటీలలో ప్రథమ బహుమతి గెలుపొందిన కోటయ్యగూడెం జట్టుకు రూ.50వేలు, ద్వితీయ బహుమతి గెలుపొందిన ఆలే చిరంజీవి ఫాలోవర్స్ జట్టుకు రూ.25వేల నగదు బహుమతులను భువనగిరి కేంద్రంలో ఫిబ్రవరి 7న అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు గంగిడి మనోహర్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, నాయకులు దోనూరు వీరా రెడ్డి, రమణ గోని శంకర్, ఆలె చిరంజీవి, నిర్వాహకులు దిండు భాస్కర్, కట్ట కృష్ణ, పబ్బు వంశీ, పందుల శరత్, ఆల్మాస్ పేట గౌతమ్, కిషోర్, కార్తీక్, బన్ని, పల్లె వెంకటేష్, విష్ణుకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# మున్సిపల్ ఎన్నికల్లో కలిసివచ్చే పార్టీలతో బరిలోకి

**: గోశిక కరుణాకర్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో కలిసివచ్చే లౌకిక శక్తులతో మున్సిపాలిటీలోని 20వార్డుల్లో సిపిఎం పార్టీ బరిలోకి దిగుతుందని సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి భవనంలో మున్సిపల్ కార్యదర్శివర్గ సభ్యులు దండ అరుణ్ కుమార్ అధ్యక్షతన సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోశిక కరుణాకర్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాడుతున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల మధ్యన ఉండి, స్థానిక సమస్యలు తెలుసుకుని, ఆ సమస్యల పరిష్కారానికి అనునిత్యం పనిచేసే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. గతంలో చిన్న గ్రామ పంచాయతీగా ఉన్నటువంటి చౌటుప్పల్ నేడు జిల్లాలోని అధిక జనాభా కలిగి ఉందన్నారు. జనాభాకు అనుగుణంగా సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ లో అనేక సమస్యల పరిష్కారానికి సిపిఎం పార్టీ పోరాటాలు చేసిందని, భవిష్యత్తులో సైతం చేస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎండి పాషా, మాజీ సిపిఎం పార్టీ ఫ్లోర్ లీడర్ గోపగోని లక్ష్మణ్, నాయకులు బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఉష్కాగుల శ్రీనివాస్, పర్నె ధర్మారెడ్డి, బొడ్డు అంజిరెడ్డి, బాతరాజు దశరథ, తొర్పునూరి మల్లేశం, గుణమోని ఐలయ్య, చీకూరి ఈదయ్య, చింతకింది పాండు, సప్పిడి శ్రీనివాసరెడ్డి, సిలివేరు జంగయ్య, దాసరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి 'ఎడ్యుక్వెస్ట్'లో జిల్లాకు ద్వితీయ స్థానం

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:తెలంగాణ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీఆర్టి సంయుక్తంగా హైదరాబాదులోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఎడ్యుక్వెస్ట్ ఆంగ్ల సీనియర్ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థిని మేధా శ్రీ రాష్ట్ర ద్వితీయ బహుమతిని సాధించిందని ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు షేక్ దస్తగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్స్ మీరా హుస్సేన్‌లు తెలిపారు. ఎస్‌సిఈఆర్‌టి ఇంగ్లీష్ విభాగం ఫాకల్టీ హెడ్ ఖమంగారెడ్డి చేతులమీదుగా రూ.5 వేల నగదు, ప్రశాంస పత్రం, మెమొంటోను మేధా శ్రీకి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఏజెన్సీ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల ప్రతిభ పాటవ పోటీలలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించటం మన జిల్లాకు ఎంతో గర్వకారణం అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎడ్యుక్వెస్ట్ సీనియర్ స్ట్రీమ్ వన్ విభాగంలో రాష్ట్ర ద్వితీయ స్థానాన్ని పొందిన మేధాశ్రీని పలువురు టీచర్స్ అభినందించారు. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే ఎడ్యుక్వెస్ట్ విభాగంలో రాష్ట్ర ద్వితీయ స్థానాన్ని పొందిన విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విద్యార్థినికి గైడ్ టీచర్‌గా బి.అరుణ కృషి అభినందనీయమన్నారు. ఆంగ్ల పోటీల వలన విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అరుణ, మాధవి, మురళి, స్వాతి, రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వీరశైవ లింగాయత్ లింగ బలిజల హక్కుల సాధనకు కృషి

*** వీరశైవ లింగాయత్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అరవింద్**



అందోలు, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజల హక్కుల సాధనకు కృషి చేస్తానని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఆరగొండ అరవింద్ అన్నారు. యువజన విభాగం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. వీరశైవ, లింగబలిజలు అన్ని రంగాల్లో రాణించాలంటే వీరశైవ లింగాయత్, లింగబలిజలు ఐక్యంగా ఉండాలన్నారు. వీరశైవ హక్కుల కోసం సాధనలో సంఘం రాష్ట్ర నాయకత్వంతో కలసి పనిచేస్తానన్నారు. వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ఓబీసి జాభితాలో లేకపోవడంతో విద్య మరియు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ఓబీసి జాభితాలో చేర్చాలని కోరారు.భావితరాలకు విద్య ఉపాధి అవకాశాలలో లబ్ది పొందుటకు ఓబీసిలో కలిపే వరకు పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయిలో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వీరశైవ లింగబలిజ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.సంగమేశ్వర్,యువజన నాయకులు దినేష్ పాటిల్, పి. శివచరణ్, భరత్, ప్రశాంత్ పాటిల్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. బిజలీపూర్ గ్రామానికి చెందిన యువకుడు అరవింద్‌కు రాష్ట్ర స్థాయి పదవి లభించడం పట్ల గ్రామ, మండల వీరశైవలింగాయత్ లింగ బలిజ సంఘ నాయకులతో పాటు ఆయా సంఘాల నాయకులు లభినందనలు తెలియజేశారు.

# నిరుద్యోగ యువత 'డీట్' ను సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కె. సంజీవరావు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకుగాను తెలంగాణ ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించబడిన 'డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్) మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కె. సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌లో నమోదు చేసుకోవడానికి ఎటువంటి విద్యార్హత పరిమితి లేదని, అన్ని రకాల విద్య, సాంకేతిక నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, జాబ్ సీకర్‌గా పేర్లను నమోదు చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన నిరుద్యోగ యువతీ, యువకులను కోరారు.

# గ్రాండ్ నర్సరీ మేళాకు అనూహ్య స్పందన



కాంక్రీట్ జంగిల్ లా మారుతున్న నగర జీవనంలో పచ్చదనం, ప్రకృతి సౌందర్యానికి గ్రాండ్ నర్సరీ మేళా ఎంతో ఉపయోగ పడుతుందని నిర్వహకులు తెలిపారు. నగరంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 19వ గ్రాండ్ నర్సరీ మేళా ఆకట్టుకుంటోంది. గ్రీనరీ ప్రియులు, సందర్శకుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చి వివిధ రకాల మొక్కలు, పూల మొక్కలు, గార్డెనింగ్ సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నర్సరీ ఉత్పత్తులతో ఈ మేళా కొలువుదీరింది. ఈ మేళాలో 120 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబై, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్, పుణె, షిర్డీ, కడియం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అరుదైన, ఎక్సాటిక్ మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

# చెరువు, కుంటల కాల్వల మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు రూపొందించండి

**- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**



అందోలు, ప్రజాస్ఫూర్తి: పంట కాల్వల మరమ్మత్తుల కోసం బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలు రూపోందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సీ. దామోదర రాజనర్సింహ ఇరిగేషన్ అధికారులను అదేశించారు.శనివారం మంత్రి తన నివాసంలో అందోల్ నియోజక వర్గంలోని అల్లాదుర్గ్, రెగోడ్, టేక్మాల్ (మెదక్ జిల్లా) మండలాలలో ఉన్న చెరువులు, కుంట కట్టల మరమ్మత్తులు, పీడర్ కెనాల్ పునరుద్దరణ పనులు, పంట కాల్వల నిర్మాణం, పునరుద్దరణ పనుల పై ఇరిగేషన్ అదికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో అల్లాదుర్గ్ మండలం లో ఉన్న 132 , టెక్మాల్ మండలం లోని 135 , రేగోడ్ మండలం లోని 91 చెరువులు, కుంటలు, పీడర్ కేనాల్ లు , పంట కాల్వల మరమ్మత్తుల కోసం బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలు రూపోందించాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను అదేశించారు. అల్లాదుర్గ్ మండలం లోని చెరువుల, కుంటల క్రింద 5778 ఎకరాలలో సాగు అవుతున్న అయాకట్, టెక్మాల్ మండలంలోని 5802 ఎకరాలలో సాగు అవుతున్న అయాకట్, రేగోడ్ మండలం లోని 4011 ఎకరాలలో సాగు అవుతున్న ఆయాకట్ లకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించటం తో పాటు అదనపు ఆయకట్టు ను పెంచటానికి చెరువుల మరమ్మత్తు పనులు ఈ సీజన్ లో పూర్తి చేసేలా అవసరమైన కార్యాచరణ ను రూపోందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇరిగేషన్ శాఖాధికారులను అదేశించారు. టేక్మాల్ మండలం లోని చిన్నచెరువు, పెద్ద చెరువు, అల్లాదుర్గ్ లోని పటేల్ చెరువు, అల్లాదుర్గ్ చెరువు, బోల్కం చెరువు , గడి పెద్దాపూర్ చెరువు, అప్పాజి పల్లి గిద్దమ్మ చెరువు, రామ్ పూర్ చెరువు, ముప్పారం చెరువు, నల్లకుంట చెరువుల కట్టల మరమ్మత్తుల తోపాటు ఫీడర్ కెనాల్ , పంట కాల్వల నిర్మాణం, పునరుద్ధరణ పనులపై మంత్రి చర్చించారు. అలాగే, రేగోడ్ మండలం లోని రేగోడ్ పెద్ద చెరువు , గజ్వాడ , కామొల్లి, కోత్వాల్ పల్లి పెద్ద చెరువుల చెర్వు కట్టల మరమ్మత్తు , ఫీడర్ కెనాల్ , పంట కాల్వల పనుల పునరుద్దరణ పనులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇరిగేషన్ శాఖ అధికారులు అంచనాల ప్రతిపాదనలను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఇరిగేషన్ శాఖాధికారులను అదేశించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ ఈ ఈ రవీంద్ర కిషన్, డిప్యూటి ఈ ఈ సుబ్బలక్ష్మీ, ఎ ఈ లు పాల్గోన్నారు.

## కార్యకర్తలకు రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ ట్రస్ట్ అండ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ట్రస్టు ఉపాధ్యక్షుడు జీంద్రు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎంఏ ఖయ్యూంలు అన్నారు. రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వికలాంగురాలు ఊదరి రమణ కుటుంబ సభ్యులకు శనివారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండలంలోని జైకేసారం గ్రామానికి చెందిన కాసుల బాల నరహరి అనారోగ్యానికి గురికావడంతో, చికిత్స నిమిత్తం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండడమే రాజీవ్ స్మారక్ ఫౌండేషన్ ట్రస్ట్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నల్ల నరసింహ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుర్కంటి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సుర్కంటి చిన్న వెంకట్ రెడ్డి, ఊదరి యాదయ్య, తొర్పునూరి ఈశ్వర్ గౌడ్, బొమ్మిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సురకంటి భగవంత్ రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఊదరి వంశీ, ఊదరి రాకేష్, పుర్రు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్యలో ఉంటూ.. సమాజ సేవ చేసే వారికి అవకాశం కల్పించాలి

- **మార్గం శివ యాదవ్ కు మద్దతు పలికిన బిసి సంఘాలు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజల మధ్యలో ఉంటూ.. ప్రజా సమస్యలపై అవగాహన ఉండి.. సమాజ సేవలో ముందున్న మార్గం శివ యాదవ్ కు అవకాశం కల్పించాలని బీసీ జాక్ రాష్ట్ర కన్వీనర్ చిలకలశ్రీనివాస్ యాదవ్ కోరారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డుకు చెందిన మార్గం శివకుమార్ యాదవ్ ను బిసి సంఘాల నాయకులు మద్దతు పలికి శనివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలంటే అవకాశం కల్పించాలన్నారు. అవకాశం కల్పిస్తే యువత రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలకడం ఖాయమన్నారు. 14వ వార్డులో యువకుడు మార్గం శివ యాదవ్ కు ప్రజలకు సేవ చేసే వ్యక్తిగా గుర్తింపు ఉందన్నారు. వార్డులో స్థానికంగా ఉండడం, వార్డులోని సమస్యల పట్ల అవగాహన, విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో అనుభవం కలిగిన శివకు అవకాశం కల్పించాలని కోరారు. మునుగోడు ఉప ఎన్నికల్లో సైతం బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థికి వార్డు నుంచి చేసిన కృషిని బిజెపి పార్టీ గుర్తించాలని విన్నవించారు. బిజెపి పార్టీ నుంచి మార్గం పూజ శివ యాదవ్ కు బీఫామ్ ఇస్తే, గెలిచి మున్సిపల్ కార్యాలయంలో అడుగు పెట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ నాయకుడు అంబర్‌పేట శ్రీనివాస్ యాదవ్, యాదవ్ సంఘం మండల కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్, జింకల మారయ్య యాదవ్, చంద్రశేఖర్, ఊడుగు శ్రీశైలం గౌడ్, సర్వేల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఐద్వా' ఫోటో ఎగ్జిబిషన్‌లో మహిళా పోరాటాలు



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కొంగు నడుంకు కట్టి, కొడవళ్లు చేతబట్టి.. వెట్టి, స్త్రీ విముక్తి. భూపోరాటాల నుంచి నేడు స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఫోటో ఎగ్జిబిషన్ ఆవిష్కరించింది. జనవరి 25 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు హైదరాబాద్ లోని జరగనున్న అఖిలభారత మహాసభలను పురస్కరించుకుని శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రారంభించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్ హాల్ ను ఐద్వా కోశాధికారి ఎస్. పుణ్యవతి, సాయుధ పోరాటాల చిత్రమాలిక హాల్ ను సుధా సింధూరస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై కొనసాగుతున్న వివక్ష, దాడులు, చట్టబద్ధంగా వారికి రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన, సుప్రీంకోర్టు నిర్దేశించిన సమాన పనికి సమాన వేతనం, వితంతు పెన్షన్లు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై మహాసభలో చర్చించి తీర్మాణాలు చేయనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో ఘోరంగా విఫలమైందనీ, వెంటనే చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం కల్పించాలన్నారు. బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో, దేశంలో స్త్రీలపై సాంస్కృతిక దాడి ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల వస్త్ర దారణ కేంద్రంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సహాయ కార్యదర్శులు కె. ఎన్. ఆశాలత, బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వగురు స్థానంలో భారత దేశాన్ని నిలపాలనేదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం

- **భారత ప్రభుత్వ హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**





మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : విశ్వగురు స్థానంలో భారత దేశాన్ని నిలపాలనేదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని భారత ప్రభుత్వ హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని హకీంపేట్ లో గల నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటి అకాడమీ అథారిటిలో ఏర్పాటు చేసి రోజ్‌గార్ మేళా కార్యక్రమం కింద నియమితులైన యువతకు నియామక పత్రాలను అందించే కార్యక్రమంలో ఎన్ఐఎస్ఎ డైరెక్టర్ డిపి.పరిహార్, డిప్యూటి డైరెక్టర్ అనీల్ దాము లతో కలిసి సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా సహాయ మంత్రి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుందని, నిరుద్యోగయువత కష్టపడి చదవి ఉద్యోగం సంపాదించాలని అన్నారు. ఉద్యోగ ప్రక్రియలో ఎక్కడ ఎలాంటి అవినీతికి తావు లేదని కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచనలు చేస్తూ, కేవలం జీతం కోసం కాకుండా దేశం, సమాజ సేవకు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ వేదిక ఒక భరోసా, భవిష్యత్తులో ఉద్యోగం కల్పింస్తుందనడానికి ఏలాంటి సందేహం లేదన్నారు.. వికసిత భారత్ @2047" లక్ష్యంతో భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని, ఆ లక్ష్య సాధనలో కొత్త ఉద్యోగులు నిరంతర భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగమే సాంధించాలనే ధృక్పదంతో కాకుండా, ఉపాధి సృష్టికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రధాన మంత్రి సంకల్పానికి అనుగుణంగా, రోజ్‌గార్ మేళా ఈ దృక్పథాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చే ముఖ్యమైన కార్యక్రమంగా నిలుస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో 61 వేల మంది కొత్తగా నియమితులైన ఉద్యోగులకు నియామక పత్రాలు అందించే ఉద్దేశంతో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఎస్ఎ లో మొత్తం 238 మంది అభ్యర్థులు నియామక పత్రాలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా రోజ్‌గార్ మేళాలను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా భారత ప్రభుత్వ హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.




## రోడ్డుపై ప్రయాణించెటప్పుడు హెల్మెంట్ తప్పనిసరిగా వాడాలి

- **ఎమ్మెల్యే కోరం కనకయ్య**

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: రోడ్డుపై ప్రయాణించెటప్పుడు హెల్మెంట్ తప్పనిసరిగా వాడాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బస్ డిపో నందు జరిగిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయానించేటప్పుడు మనందరం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సెవించి,సిగరెట్ తాగుతూ,సెల్ ఫోన్ వాడుతూ రోడ్డు పై ప్రయాణం చేస్తు ఉంటారని, ఆవిధంగా ప్రయాణం చేయడం చాలా ప్రమాదకరం అని వాహనదారులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. మనల్ని నమ్ముకోని ఇంటి దెగ్గర మన కుటుంబం ఉంది అనీ ఆలోచన చేయాలన్నారు. తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులందరు హెల్మెంట్ భాధ్యతగా భావించి హెల్మెంట్ వాడాలన్నారు. రాష్ట ప్రభుత్వాలు రోడ్ల పై దృష్టి సారించి రోడ్లు అభివృద్ధి చేస్తుంటే,యువత అధిక స్పీడ్ తో రోడ్డు ప్రమాదాలకు గురిఅవుతున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపద్దు అని ప్రజలలో అవగహన కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం పోలిస్ శాఖ వారి ద్వారా పనిచేస్తుందన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోలిస్ శాఖ వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ ఏస్పీ భానుచంద్ర,సీఐ తాటిపాముల సురేష్, ఏస్సై హసినా,పోలిస్ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు,ఆటో డ్రైవర్స్,వాహనదారులు తదితరులు పాల్గోన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటించాలి

- **రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన**
- **చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు బాధ్యతగా పాటించాలని చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ సూచించారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం, రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ట్రినిటీ విద్యాసంస్థలు చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌరస్తా, గాంధీ పార్క్, బస్టాండ్ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు చాక్లెట్ ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు గులాబీ పువ్వు ఇచ్చి దయచేసి హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించి, ప్రజల్లో బాధ్యతాయుతమైన వాహనచలనంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. అందువల్ల వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ క్రమశిక్షణతో వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరి ఉపయోగించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, వేగ పరిమితిని అతిక్రమించకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ ప్రణీత్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జుని మంజుల, విద్యాసంస్థల చైర్మన్ కేవీపీ కృష్ణారావు, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'సండే సైకిల్'

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన , క్రీడల శాఖ ఆధ్వర్యంలో నూతన ఓటర్లచే ఫిట్ ఇండియా సైకిల్ డ్రైవ్ (సండే సైకిల్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా యువజన , క్రీడల శాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుండి సండే సైకిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ వరకు ఈ సండే సైకిల్ కార్యక్రమం కొనసాగుతుందని, ఈ కార్యక్రమంలో సైక్లిస్టులు అందరూ పాల్గొనాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రతిష్ఠ మహోత్సవం



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు పట్టణం 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కొత్తకాలనీలో సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రతిష్ఠ మహోత్సవం (మినీ మేడారం జాతర) భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మేడారం నుంచి ప్రత్యేక ఆదివాసి పూజారులు కంకణంతో బయలుదేరి ఇల్లందులోని పెద్దమ్మ గుడి వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన దండు సారయ్య సారిక చౌదరి ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ గద్దెలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారి పసుపు-కుంకుమ, ఒడిబియ్యం, బోనాలతో ఊరేగింపు, ఎత్తు బంగారం, మొక్కుబడుల చెల్లింపు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మడత వెంకట్ గౌడ్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి,తదితరులు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐఏఎస్, ఐపీఎస్.. రిజిస్టర్ మ్యారేజ్

- **చౌటుప్పల్ రిజిస్టర్ కార్యాలయంలో ఐపీఎస్ అధికారిణి శేషాద్రినిరెడ్డి, ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి వివాహం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నేటి కాలంలో వివాహం అంటే కోట్లాది. రూపాయల ఖర్చు, ఆడంబరాలతో కూడిన వేడుకలు. కానీ ఉన్నత చదువులు చదివి, బాధ్యతాయుత మైన పదవుల్లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎంతో నిరా డంబరంగా వివాహం చేసుకొని సమాజానికి సరికొత్త సందేశాన్ని ఇచ్చారు. వారిద్దరూ ఉన్నతస్థాయి అధికారులు అయినప్పటికీ ఆడంబరాలు.. హంగులు లేకుండా సింపుల్ గా రిజిస్టర్ ఆఫీసులో వివాహం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇవాళ ఈ అపురూప వేడుకకు వేదికైంది. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువ ఐపీఎస్ అధికారిణి శేషాద్రినిరెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఎలాంటి ఆడంబరాలు లేకుండా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ప్రస్తుతం శేషాద్రినిరెడ్డి కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తుండగా, శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ శిక్షణలో ఉన్నారు. కేవలం అతికొద్ది మంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఉన్నత అధికారుల సమక్షంలో వీరి వివాహం చట్టబద్ధంగా ముగిసింది. రిజిస్టర్ ఆఫీసులో సంతకాలు చేసి పూలమాలలు మార్చుకొని ఈ జంట ఒక్కటయ్యారు. కోట్లు ఖర్చు చేసే వివాహాల కంటే ఇలాంటి నిరాడంబర వివాహాలు ఎంతో గొప్పవని, సామాన్యులకు ఇదొక స్ఫూర్తి అని అక్కడికి వచ్చిన అధికారులు నూతన దంపతులను అభినందించారు. ఉన్నత చదువులు చదివి, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ఈ కొత్త జంట తీసుకున్న నిర్ణయం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# గృహ జ్యోతితో పేదలకు ఆర్థిక భరోసా

* యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్...
* లబ్ధిదారులకు గృహ జ్యోతి పత్రాల పంపిణీ..



అందోలు, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో 'గృహజ్యోతి' పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. శనివారం అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో లబ్ధిదారులకు గృహ జ్యోతి పత్రాలను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల్లో భాగంగా గృహ జ్యోతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి రెండు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందని అన్నారు. తాజాగా ప్రతి పేదింటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథక పత్రాలను గ్రామంలో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగించుకునే విషయంలో 200 యూనిట్ల వరకు ఎవరు కూడ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి రెండు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందని అన్నారు. తాజాగా ప్రతి పేదింటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని నియోజకవర్గంలో ప్రారంభిం చడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగించుకునే విషయంలో 200 యూనిట్ల వరకు ఎవరు కూడ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవనోపాధికి చిహ్నంగా నిలిచిందని పేర్కొన్నారు. పేదల పేదరికాన్ని నిర్మూలించాలనే సంకల్పంతోనే ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. తొమ్మిది నెలల్లోనే రెండు లక్షల లోపు ఉన్న రైతుల రుణ మాఫీ, అలాగే లక్షల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేపట్టినట్లు వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు కట్టించేందుకు ప్రభుత్వం మూడు విడతల్లో చర్యలు చేపడుతోందన్నారు. అలాగే ఏడు లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, పదిహేడు లక్షల పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లను నమోదు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా అమలుచేసిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు వనిమోహన్, కలపల్లి లక్ష్మి ప్రభు, యువ నాయకులు బాల్ రాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# TG: ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించిన వైద్య సంఘాలు



తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 229పై వైద్యసంఘాలు భగ్గుమన్నాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 229ను నిరసిస్తూ రాష్ట్రంలోని అలోపతి వైద్యుల సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. కోఠిలోని ఐఎంఏ హాల్‌లో శనివారం రాత్రి జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన వైద్య సంఘాల ప్రతినిధులు పాల్గొని, ప్రభుత్వ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఖండించారు. ఈ సందర్భంగా తెలంగాణ అలోపతిక్ డాక్టర్స్ అసోసియేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టాడాజేఏసీ) పేరిట ఉమ్మడి వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో నలుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులను నియమించేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో 229.. కౌన్సిల్ ప్రజాస్వామ్య స్వభావానికి విఘాతం కలిగిస్తుందని వైద్య సంఘాలు ఆరోపించాయి. ఇది వైద్య మండలి వ్యవహారాల్లో అనవసరమైన ప్రభుత్వ జోక్యానికి దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశాయి. జీవో 229ను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ టాడాజేఏసీ ఆధ్వర్యంలో దశల వారీగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యులందరూ విధుల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కొనసాగిస్తారని తెలిపారు. ప్రధాని కార్యాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖలకు వైద్యుల నుంచి సామూహిక వినతిపత్రాలు పంపుతామని జేఏసీ నేతలు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో దశలవారీగా వైద్య సేవలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. చివరి అస్త్రంగా హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రోగుల సంరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, అయితే మెడికల్ కౌన్సిల్ స్వయంప్రతిపత్తి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని వైద్య సంఘాలు తేల్చిచెప్పాయి. ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ సమావేశంలో ఐఎంఏ, హెచ్ఆర్డీఏ, టీజుడా, టీఎస్ఆర్డీఏ, టీడీఎఫ్ సహా పలు ప్రముఖ వైద్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ ఫెస్ట్ 2K26





జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులలో ఐక్యత , సమగ్ర వికాసాన్ని పెంపొందించడంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రాముఖ్యతను ఎత్తి చూపాయని వైస్‌చైర్మన్ భూపాల్ రెడ్డి అన్నారు. కండ్లకొయ లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ యువజన పారంపర్య , ఫ్రెషర్స్ ఫెస్ట్ 2K26 ద్వారా 2026 సంవత్సరాంతాన్ని అత్యంత ఉత్సాహోద్రేకాలతో సన్మానించింది. ఈ కార్యక్రమం సాంస్కృతిక వారసత్వం, సాంప్రదాయ విలువలు , యువశక్తి యొక్క ఉజ్వల సంగమంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు , నిర్వహణా సిబ్బందిని ఒక వర్ణమయ వేడుకలో ఏకమైత్రి పాటించింది. బ్లాక్1 లో జరిగిన భవ్య సమావేశంతో ఈ దినం ప్రారంభమై, గంభీరమైన జ్యోతి ప్రజ్వలన , ప్రార్థనా గీతం వేడుకలకు భక్తిభావం నింపాయి. తర్వాత రాట్నం పోరు, సంగీత కుర్చీ, బెలూన్ బ్లాస్ట్ మరియు గాలిపటం ఎగరవేత వంటి ఆకర్షణీయ కార్యక్రమాలు ఆనందం , సౌహార్దపూరిత వాతావరణాన్ని సృష్టించాయి.ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు సెక్రటరీ & కారస్పాండెంట్ భూపాల్ రెడ్డి , శ్రీశైలం రెడ్డి, డాక్టర్ ఎ. శ్రీనివాసుల రెడ్డి, ప్రిన్సిపాల్ లతో సహా అతిథులు అలంకరించారు. వారు సభను సంబోధించి మాట్లాడుతూ ఆయోజక బృందం యొక్క కృషిని ప్రశంసించారు. వారి ప్రేరణాదాయక మాటలు అందరినీ ఉత్తేజితుల్ని చేశారు. ఈ వేడుకలో ఒక ప్రత్యేక ఆకర్షణ పారంపర్య దినోత్సవ ప్రదర్శనలు, ఇందులో దేశం నలుమూలల నుండి వివిధ పండుగలను విభాగాలు సృజనాత్మకంగా చిత్రించాయి. సంక్రాంతి, వినాయక చవితి, దీపావళి, ఉగాది, శ్రీకృష్ణ జన్మాష్టమి, బోనాలు వంటి ప్రతీకల ద్వారా తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ యొక్క జీవంతమైన సంప్రదాయాలు ప్రతిబింబించాయి. ఇంకా, క్రిస్మస్, రంజాన్, గర్బాడాన్స్ వంటి పండుగలు భారతదేశంలోని 'ఏకంలో అనేకం' సూత్రానికి ప్రతీకలయ్యాయి. ఒడిశా, ఛత్తీస్గఢ్, కర్ణాటక, పంజాబ్ మరియు బిహార్ నుండి రాష్ట్రీయ వేడుకలు ప్రాంతీయ సంస్కృతుల వైభవాన్ని వెలిగించాయి. పురి జగన్నాథ యాత్ర, ద్వాదశ జ్యోతిర్లింగాలు, మరియు కళాత్మకమైన బొమ్మల కొలువు వంటి ఆధ్యాత్మిక సంప్రదాయాలు ఈ సందర్భానికి ఒక దైవిక ఛాయను చేర్చాయి.విద్యార్థులు , ఉపాధ్యాయులు పారంపర్య వేషధారణలతో అలంకరించుకుని, క్యాంపస్ను సంస్కృతి , వారసత్వం యొక్క బహుళవర్ణ దర్శినిగా మార్చారు. ఈ ప్రదర్శనలను పరిశీలించి, ప్రతి విభాగం యొక్క సృజనాత్మకత కృషికి మారుమూల స్తుతులు అర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు దర్శకుల కన్నులపండువగా నిలిచాయి. విద్యార్థులు దండియా నృత్యాలు, విషయాత్మక సమూహ , ఏకపాత్ర ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. "ప్రజ్వలా సాంగ్" విడుదల ఈ వేడుకలకు ఒక మధురమైన సారాన్ని చేకూర్చింది. నిర్వహణ , ఉపాధ్యాయుల రాంప్ వాక్ ఒక సంతోషకరమైన భాగంగా, అడ్డంకులు తొలగించి మైత్రిపూర్వకమైన, ఉల్లాసభరిత వాతావరణాన్ని సృష్టించింది. అనంతరం ఫ్రెషర్స్ డే వేడుకలలో భాగంగా కొత్త బ్యాచ్ విద్యార్థులకు స్వాగతం పలికాయి. కొత్తవారు, సీనియర్స్ సోలో, డ్యూయట్ , గ్రూప్ డ్యాన్స్ లలో పాల్గొని, తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఫ్రెషర్స్ మరియు సీనియర్స్ యొక్క రాంప్ వాక్, ఆటలు ,ప్రాణఘనమైన డీజే సెషన్ రోజు యొక్క ఉత్సాహాన్ని మరింత పెంచాయి. వివిధ పోటీలలో విద్యార్థులు సాధించిన ఘనతను గౌరవించే బహుమతి పంపిణీ వేడుక జరిగింది ఈ కార్యక్రమంలో కన్వీనర్ , హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ శాఖాధిపతి డాక్టర్ కె.వి. రెడ్డి ఈ ఉత్సవాన్ని రూపకల్పన చేయడంలో , సమన్వయం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన మార్గదర్శకత్వం , సూక్ష్మపరిశీలనాపూర్వక ప్రణాళిక ఈ వేడుకల నిర్వహణను నిర్విఘ్నంగా నిర్వహించి, దీనిని ఒక గొప్ప విజయంగా మార్చింది. విద్యార్థులలో సాంస్కృతిక జాగృతి , సహకార భావనను ప్రోత్సహించడంలో ఇలాంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను ఆయన మరింతగా నొక్కి చెప్పారు. ఆయన ప్రోత్సాహం ,దూరదృష్టి విద్యార్థులు , ఉపాధ్యాయులు సక్రియంగా పాల్గొనడాన్ని ప్రేరేపించడంలో నిర్ణాయకమైనవి.

# తెలంగాణ కంచి... కొడకంచి

* ఈ నెల 22నుండి 31వరకు బ్రహ్మోత్సవాలు





జిన్నారం,ప్రజాస్ఫూర్తి: సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని కొడకంచి గ్రామం తెలంగాణ కంచిగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆదినారాయణ స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అల్లాణి రామోజీరావు తెలిపారు.ఈ ఆలయానికి ప్రత్యేక విశిష్టతగా బంగారు బల్లి, వెండి బల్లి ప్రతీకలు ఉన్నాయి. తమిళనాడులోని కాంచీపురం వరదరాజ పెరుమాల్ ఆలయంలోని సంప్రదాయానికి అనుగుణంగా ఇక్కడ కూడా తమిళ్ పెరుమల్ వేదమంత్రాలతో పూజలు, ఉత్సవాలు నిర్వహించబడటం విశేషం. పాము, బల్లి వంటి దోషాలు తొలగిపోతాయని నమ్మకంతో భక్తులు ఈ ప్రతిమలను తాకి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయ సమీపంలో ఉన్న వెయ్యేళ్ల చరిత్ర గల బ్రహ్మసూత్ర శివలింగం అత్యంత పవిత్రమైనదిగా భక్తులు విశ్వసిస్తున్నారు. నీటిలో కొట్టుకొచ్చిన ఈ శివలింగం కోటి శివలింగాలతో సమానమని భావించి భక్తులు నిరంతరం అభిషేకాలు నిర్వహిస్తూ దర్శించుకుంటున్నారు. ఈ క్షేత్రాన్ని సందర్శించడం ద్వారా సకల అష్టైశ్వర్యాలు లభిస్తాయని భక్తుల నమ్మకం.

## బ్రహ్మోత్సవాల కార్యక్రమాల వివరాలు:

22న: శుద్ధ చవితి – అధ్యయనోత్సవం, తొలాకి సేవ
23న: పంచమి – అధ్యయనోత్సవం, సాయంత్రం తులాకి సేవ ఊరేగింపు
24న: పరమపథోత్సవం, పుట్ట బంగారు సేవ, అగ్ని ప్రతిష్ట
25న: ధ్వజారోహణం, సాయంత్రం స్వామివారి దివ్య కళ్యాణోత్సవం, అశ్వసేవ ఊరేగింపు
26న: హనుమంత సేవ ఊరేగింపు
27న: గరుడ ప్రతిష్ట, గరుడ వాహన సేవ
28న: తిరువంజనం, అలకసేవ, హోమం, బలిమరణం, రథ ప్రతిష్ట
29న: ముఖ్య ఘట్టం – జాతర, స్వామివారి దివ్య రథోత్సవం ఊరేగింపు
30న: దోపి సేవ, హోమం, పూర్ణాహుతి, పుష్పయాగం, భూతబలి, సప్తవరణాలు
31న: త్రయోదశి – ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాల ముగింపు

## భక్తులకు విస్తృత ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు, క్యూలైన్ వ్యవస్థ, వాలంటీర్ల సేవలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తుల రాకపోకల కోసం పటాన్చెరు నుండి బొంతపల్లి కమాన్ వరకు 515 నెంబర్ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని, అలాగే ఓఆర్ఆర్ సుల్తాన్పూర్ ఎగ్జిట్ నెంబర్-4 ద్వారా కూడా ఆలయానికి చేరుకోవచ్చని ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ అల్లాణి రామోజీరావు తెలిపారు.దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా కొడకంచి ఆలయం భక్తుల విశేష ఆదరణ పొందుతోందని ఆలయ అర్చకులు నారాయణాచార్యులు పేర్కొన్నారు.

# ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పోరేషన్ నుంచి రెండు పేర్లు ఇవ్వండి..

**డీసీసీ చీఫ్‌లకు టీపీసీసీ చీఫ్‌లేఖ**



మున్సిపల్ ఎన్నికల కమిషన్ సమన్వయ కమిటీ సభ్యుల నియామకం కోసం ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పోరేషన్ నుంచి రెండు పేర్లు ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులకు టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన వారికి లేఖ రాశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ కు సంబంధిత కార్యకలాపాలకు సమర్థవంతైమన సమన్వయం, ప్రణాళిక, పర్యవేక్షణ లక్ష్యంగా సమన్వయ కమిటీని నియమిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. దీనికి మీ పరిధిలోని మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పోరేషన్ నుంచి రెండు పేర్లను ఈ కమిటి సభ్యులుగా నియమిస్తామన్నారు. డీసీసీ చీఫ్ లు సిఫార్సు చేసే పేర్లలో ఒకరు అడ్వకేట్ ఉండవచ్చని, తద్వారా ఎన్నికల ప్రక్రియలో చట్టపరమైన సమన్వయంతో పాటు కమిటి బలోపేతం అవుతుందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. పంపే పేర్లలో అనుభవజ్ఞులైన, చురుకైన, అంకితభావం కలిగిన కాంగ్రెస్ కార్యకర్త ఉండాలన్నారు. ఈ పేర్లను టీపీసీసీ ఉపాధ్యక్షులు జగదీశ్వర్ రావుకి సోమవారం నాటికి వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా ఇవ్వాలన్నారు. పీసీసీ కార్యాలయంలో నేరుగా సమర్పిస్తే కమిటీని వెంటనే ఏర్పాటు చేసి సన్నాహ సమావేశాలను వెంటనే ప్రారంభించవచ్చన్నారు.

# వీ బీజీ రామ్ జీ నూతక శకానికి ఆరంభం

* కొయ్యలగూడెం లో ఉపాధి కూలీలకు అవగాహన సదస్సు
* బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్ గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం 2025 (వీ బీజీ రామ్ జీ) నూతన శకానికి ఆరంభమని బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో వీ బీజీ రామ్ జీ పై ఉపాధి కూలీలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కైరంకొండ స్వప్న అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరిట మోదీ ఇప్పటివరకు ఎనిమిది లక్షల కోట్ల పనులు చేయించారన్నారు. కానీ ఆ డబ్బులు ఉపాధి కూలీల వరకు వెళ్లకుండా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని గ్రహించిన మోదీ పథకానికి నూతన హంగులు దిద్దారు. అందులో భాగంగానే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును ఇటీవల ప్రధానమంత్రి మోదీ వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్ గార్, ఆజీవికా మిషన్ ( గ్రామీణ)గా మార్చుతూ చట్టం చేశారన్నారు. ఈ చట్టంపై కాంగ్రెస్ అగ్ర నాయకులు కావాలనే విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. పథకం పేరులో దేవుని పేరు రామ్ ఉండడం నచ్చడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే ముస్లిం, ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలు, దళితులకు పనులు కల్పించడమే లక్ష్యంగా చట్టాన్ని మార్చడం జరిగిందన్నారు. సంవత్సర కాలంలో రైతులకు వ్యవసాయ పనులు ఉన్న 60రోజులు మాత్రమే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరిట గ్రామాల్లో నిజమైన పనులు జరగాలి. నీటి సంరక్షణ కోసం గ్రామాల్లో చెరువులు, విపత్తు తుఫాన్లు వచ్చిన సందర్భంలో పనులు చేపట్టాలి, రోడ్లు, భవనాలు నిర్మించుకోవడానికి, పనుల్లో పారదర్శకత కోసమే బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పకడ్బందీగా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు కావడం దేశానికి మంచిది కాదన్నారు. కుల, మతాలకతీతంగా ప్రధానమంత్రి మోదీ నాయకత్వం యువత కోరుకుంటున్నారు. కొయ్యలగూడెం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, గంగిడి మనోహర్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, వార్డు సభ్యులు పిల్లలమర్రి సుజాత, కొయ్యడ గౌతమి, పిష్క సంజీవకుమార్, రచ్చ ఉపేందర్, ఏల వరలక్ష్మి, మాదూరి నగేష్ ఎర్రగుంట మంగమ్మ, వనం శ్రీలత, నాయకులు దూడల బిక్షం గౌడ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, దోనూరి వీరారెడ్డి, గడ్డం నర్సింహ్మ, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేశం యాదవ, జెల్ల పాండు, చిలివేరు రమాశంకర్, నామని నరేష్, ఇమ్మడి ఈశ్వర్, వర్కాల రఘురాం, గుర్రం శ్రీనివాస్, కైరంకొండ పాండు, వనం సురేందర్, గడ్డం బాబు, పాటి లక్ష్మారెడ్డి, యాస అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్ రెడ్డి, ఊదరి దివ్య, నూనె మాధవి, రెవెళ్ళి స్వప్న, బర్మ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# అతిపెద్ద బీచ్ ఫెస్టివల్.. విశాఖ ఉత్సవ్‌లో హెలికాప్టర్ రైడ్ ప్రారంభం.. మంత్రి సందడి

విశాఖ ఉత్సవ్‌లో భాగంగా రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులకు అద్భుత అనుభూతిని అందించే హెలికాప్టర్ రైడ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ హెలికాప్టర్ రైడ్ ప్రారంభించి, అందులో ప్రయాణించి సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం సముద్రతీరాలు, కొండలు, నగర సౌందర్యాన్ని ఆకాశ మార్గం నుంచి వీక్షించే ఈ అవకాశం ప్రతి సందర్శకుడికి ఒక మరపురాని అనుభవం అవుతుందన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్ తదితరులతో కలిసి హెలికాప్టర్ రైడ్‌లో ప్రయాణించి నగర అందాలను తిలకించామని తెలిపారు. ఏపీ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి



తీసుకెళ్లడమే లక్ష్యంగా విశాఖ ఉత్సవ్‌ను దేశంలోనే అతిపెద్ద బీచ్ ఫెస్టివల్‌గా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. విశాఖ ఉత్సవ్‌కు విచ్చేసే సందర్శకులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో హెలికాప్టర్ రైడ్‌తో పాటు పారామోటరింగ్, స్కూబా డైవింగ్, పారా సెయిలింగ్, కయాకింగ్ వంటి అడ్వెంచర్ సేవలను వినియోగించుకుని విశాఖ అందాలను ఆస్వాదించాలని మంత్రి కోరారు.




## హైదరాబాద్ మ్యావరిక్స్ రోటరీ క్లబ్ వారిచే ఎంబ్రాయిడరీ మెషిన్స్ విరాళం

సీఆర్ ఫౌండేషన్ మహిళాసంక్షేమ వృత్తినైపుణ్యం కేంద్రానికి హైదరాబాద్ మ్యావరిక్స్ రోటరీ క్లబ్ వారు రూ. 40 వేల విలువ చేసే రెండు ఎంబ్రాయిడరీ మెషిన్స్ విరాళంగా అందించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డా. టి.సురేష్ బాబు, ఒకేషనల్ డైరెక్టర్ ఆశా ఆచార్య, సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అజయ్ కుమార్, సభ్యులు కె.విజయలక్ష్మి మహిళా సంక్షేమకేంద్రం డైరెక్టర్ శ్రీమతి జోస్యభట్ల కల్పన కు అందచేసారు. ఈ ఎంబ్రాయిడరీ మెషిన్స్ ద్వారా ఎక్కువ మంది మహిళలకు ఎంబ్రాయిడరీ నేర్పించగలమని, వారికి ఎంతో ఉపయోగం అని కల్పన పేర్కొని, రోటరీ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి శ్రీ చెన్నకేశవరావు, మహిళాకేంద్రం సభ్యులు లలిత, ఉపాధ్యాయినిలు, శిక్షణ పొందుతున్న మహిళలు,




సీఆర్ పాలిక్లినిక్ సభ్యులు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సురేష్ గారు మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాగే ఈ మెషిన్స్ కి ఆర్థిక సహాయం అందించిన ఆశా ఆచార్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ధరణి పోర్టల్ ద్వారా
# భూములు కబ్జా చేసిన వారిని వదిలిపెట్టం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: ధరణి పోర్టల్ ద్వారా భూములు కబ్జా చేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్ము కాజేసిన వారిని వదిలేది లేదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా అక్రమాలు చేసిన ఘటనలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. "పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని



గత ప్రభుత్వంలోని పెద్దలు భూములు కాజేశారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు నివేదికలో స్పష్టమైంది. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35 వేల లావాదేవీలు జరిగాయి. 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించాం. 9 జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు. ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా నిర్వహిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలు.. సమన్వయకర్తలను ప్రకటించిన బీఆర్ఎస్

హైదరాబాద్: పురపాలక ఎన్నికల కోసం భారత రాష్ట్ర సమితి ఇన్‌ఛార్జిలను నియమించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఒక సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం సమన్వయకర్తల ప్రధాన బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జిలు కీలక పాత్ర పోషిస్తారన్న ఆయన... స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్ఠానానికి సమర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను పర్యవేక్షిస్తారని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# నాంపల్లిలో ట్రాఫిక్ ఆంక్షలు.. నుమాయిష్ సందర్శకులకు కీలక సూచన


హైదరాబాద్: నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో ప్రజలకు సీపీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని సందర్శకులు నుమాయిష్ పర్యటనను ఈ రోజు వాయిదా వేసుకోవాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. నాంపల్లి స్టేషన్ రోడ్‌లో అగ్నిప్రమాదం కారణంగా.. పరిసర ప్రాంతాల్లో వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు. ఫర్నిచర్ దుకాణంలో చెలరేగిన



మంటలు దాదాపు అదుపులోకి వచ్చాయని సజ్జనార్ వెల్లడించారు. ఘటనాస్థలిని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పొగ ఎక్కువగా ఉండటంతో సిబ్బంది భవనం లోపలికి వెళ్లలేకపోతున్నామని తెలిపారు. "లోపల ఎంతమంది చిక్కుకున్నారనే దానిపై స్పష్టత లేదు. ముగ్గురు లేదా నలుగురు చిక్కుకొని ఉంటారని భావిస్తున్నాం. సహాయకచర్యలు పూర్తయ్యేందుకు మరో 23 గంటలు పట్టొచ్చు. రోబోను పంపించి లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు" అని తెలిపారు.

# సీపీ సజ్జనార్ నోటీసులకు సమాధానం ఇస్తా: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్


హైదరాబాద్: నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఇచ్చిన నోటీసులకు సమాధానంగా తన వద్ద ఉన్న సమాచారంతో జవాబు ఇస్తానని, ఆ తరువాత ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చని భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సజ్జనార్ నోటీసుల నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను వ్యక్తిగత దూషణలు చేయనని, చిల్లర భాష వాడనని, వాస్తవాలు దాచనని, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం ఆపబోనని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్, హరీశ్ రావుకు సంబంధం లేకున్నా నోటీసులు ఇచ్చి సిట్ గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధిస్తున్న ప్రహసనాన్ని ఖండించిన 12 గంటల్లోనే పోలీసులు ఇంటికి వచ్చి తనకు నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఆధారాలతో సహా సమాధానం ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని హెచ్చరించారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం తన హక్కని.. వార్నింగ్‌లకు భయపడబోనని పేర్కొన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ మీద ఏపీలో నమోదైన కేసులపై మరో సిట్ వేయాలని తాను డిమాండ్ చేసినట్లు నోటీసులో ఉందని, అది వాస్తవ విరుద్ధమని తోసిపుచ్చారు. పోలీస్ అధికారులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో పావులుగా మారవద్దని సలహా ఇచ్చినట్లు తెలిపారు. నాటి డీజీపీ, హోంసెక్రెటరీ, సీఎస్ లాంటి అధికారులందరినీ విడిచిపెట్టి సిట్ అధికారులు కేవలం విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్ రావు, ఆయన కుటుంబాన్ని, ఆయనతో




పనిచేసిన కానిస్టేబుళ్లు, బంధువులను వేధించడం అన్యాయమని చెప్పినట్లు వివరించారు. తాను సజ్జనార్ సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని... ఆ సంస్కృతి తనకు లేదని తెలిపారు.

## మహబూబాబాద్‌లో విషాదం.. మహిళ కళ్ల ముందే భర్త, కుమారుడు మృతి


మహబూబాబాద్ రూరల్: తండ్రి నాలుగేళ్ల కుమారుడిని సరదాగా భుజాలపై ఎత్తుకొని వెళ్తున్నాడు. ఇంతలో ఆ చిన్నారి సమీపంలోని విద్యుత్తు తీగలు పట్టుకున్నాడు. దాంతో ఇద్దరూ పక్కనున్న వ్యవసాయ బావిలో పడి దుర్మరణం పాలైన విషాద ఘటన మహబూబాబాద్ మండలం బలరాంతండాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బలరాంతండాకు చెందిన కేలోత్ మదన్ (32) భార్య అనిత, చిన్న కుమారుడు లక్షిత్ (4)తో కలిసి శనివారం



వారి వ్యవసాయ పొలానికి వెళ్లారు. మదన్ ట్రాక్టర్‌తో దుక్కి దున్నిన తరువాత కుమారుడితో కలిసి భోజనం చేశారు. తరువాత బాలుడిని భార్యకు అప్పగించేందుకు తన భుజాలపై ఎత్తుకొని తీసుకెళ్తుండగా బాలుడు వ్యవసాయ మోటార్ విద్యుత్తు తీగను పట్టుకున్నాడు. ఒక్కసారిగా ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడ్డారు. భార్య అనిత వారిని చూసి కేకలు వేసింది. సమీపంలోని రైతులు వచ్చేసరికే ఇద్దరూ బావిలో మునిగిపోయారు. స్థానికులు మదన్ మృతదేహాన్ని వెలికితీశారు. బాలుడి మృతదేహం కోసం స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది గాలించి వెలికితీశారు. కళ్ల ముందే భర్త, కుమారుడు మృతి చెందడంతో అనిత రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

## కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల



ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఈనెల 23న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?: బండి సంజయ్

హైదరాబాద్: కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటన్నారు. సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని.. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందన్నారు.



కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్ కు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? అన్నారు. ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా?అని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బండి సంజయ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

*** కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి**

సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే...కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని విమర్శించారు.

# బెంగాల్‌లో 'సర్'..ఎందుకంత హడావుడి: ప్రశ్నించిన అమర్త్య సేన్



పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ ఆందోళన వ్యక్తంచేశారు. కొన్నినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను హడావుడిగా నిర్వహించడం సరికాదన్నారు. ఈ మేరకు ఆయన జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ''ఇలాంటి ప్రక్రియలు చాలా జాగ్రత్తగా, తగిన సమయం తీసుకొని నిర్వహించాలి. అయితే బెంగాల్ విషయంలో అలా జరగడం లేదని భావిస్తున్నాను. కొన్నిసార్లు ఎన్నికల సంఘం అధికారులకే తగిన సమయం లేదని భావిస్తున్నా. గ్రామీణ ప్రాంతాల్లో జన్మించిన చాలామంది భారత పౌరుల వలే నాక్కూడా జన్మ ధ్రువీకరణ పత్రం లేదు. ఓటర్‌గా నా అర్హతను నిరూపించుకోవడానికి సంబంధిత పత్రాలను సమర్పించాల్సి వచ్చింది. నా సమస్య తీరింది. అయితే అందరూ ఇంతవేగంగా స్పందించలేకపోతే.. వారి సంగతి ఏంటి..? నా సొంత నియోజకవర్గం శాంతి నికేతన్‌లో నాకున్న ఓటు హక్కు గురించి అధికారులు ప్రశ్నించారు. ఇతర వివరాలు అడిగారు. ఇవన్నీ ఇప్పటికే రికార్డుల్లో భద్రపరిచి ఉన్నాయికదా..?'' అని ప్రశ్నించారు. ఇదిలాఉంటే.. సర్ విచారణకు హాజరుకావాలని అమర్త్యసేన్‌కు ఈసీ నోటీసులు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ''ఆయన ఒక నోబెల్ గ్రహీత. దేశం గర్వించదగ్గ ఆయనను విచారణకు ఎలా పిలుస్తారు?'' అని తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఈ సర్‌ను కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే.




## విదేశాల్లో భారత్ 'వాంటెడ్'..
# రెండేళ్లలో 70 మంది గుర్తింపు!


వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న మన దేశానికి చెందిన వారిని గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. గత రెండేళ్లలో (202425) 'వాంటెడ్' జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొంది. అంతేకాదు.. ఇతర దేశాలు వెతుకుతున్న 203 మంది నిందితులు భారత్‌లో ఉన్నట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తాజా నివేదికలో పేర్కొంది. వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గతేడాది విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ (దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖ) పంపించామని, వీటిలో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందాలకు చెందినవని పేర్కొంది. ఇప్పటివరకు ఆయా దేశాల్లో మొత్తం 533 ఎల్‌ఆర్‌లు పెండింగులో ఉన్నాయని తెలిపింది.

# బడ్జెట్ సమావేశాలు.. ఎంపీ ఇంజినీర్ రషీద్‌కు కస్టడీ పెరోల్



ఢిల్లీ: ఉగ్రనిధుల కేసు నిందితుడు ఇంజినీర్ రషీద్ గత లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. త్వరలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆ సమావేశాలకు హాజరయ్యే నిమిత్తం ఢిల్లీ కోర్టు శనివారం ఆయనకు కస్టడీ పెరోల్ జారీ చేసింది. జనవరి 28న ప్రారంభమయ్యే బడ్జెట్ సెషన్‌కు హాజరు కావడానికి రషీద్‌కు అనుమతి ఇస్తూ అదనపు సెషన్స్ జడ్జి జస్టిస్ ప్రశాంత్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుల భద్రతతో ఆయన పార్లమెంట్‌కు హాజరవ్వనున్నట్లు వెల్లడించారు. జమ్మూకశ్మీర్ కు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ బారాముల్లా నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, విజయం సాధించారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై 2లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో అరెస్టయ్యారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలోని తిహార్ జైల్లో ఉన్నారు.

# ఆ విషయంలో ఎప్పటికీ క్షమాపణ కోరను: శశి థరూర్




పార్లమెంటులో తాను ఎప్పుడూ పార్టీ నియమావళిని ఉల్లంఘించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పైనే తనకు పార్టీతో అభిప్రాయభేదాలు ఉన్నాయన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు విదేశాలకు వెళ్లిన దౌత్యబృందాల్లో థరూర్ ఉన్న విషయం తెలిసిందే. అప్పుడు ఆయన వ్యవహారశైలిపై సొంత పార్టీ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తన వైఖరిని సమర్థించుకున్నారు. ఈ విషయంలో ఎప్పటికీ క్షమాపణ కోరబోనన్నారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్ (కేఎల్ఎఫ్)లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ కు ముందు రాసిన ఆర్టికల్ గురించి ప్రస్తావించారు. ఒక రచయితగా పహల్గామ్ గురించి ఆర్టికల్ రాశానన్నారు. ఉగ్రదాడులకు తగినవిధంగా సైనిక ప్రతిస్పందన ఉండాలని స్పష్టంచేసినట్టు తెలిపారు. అభివృద్ధిపై దృష్టి సారించిన భారత్.. పాక్‌తో దీర్ఘకాల ఘర్షణలకు వెళ్లకుండా ఉగ్రశిబిరాలను లక్ష్యంగా పెట్టుకోవాలని రాసినట్లు వెల్లడించారు. ఆర్టికల్‌లో తాను చెప్పిన్నట్లుగా.. కేంద్ర ప్రభుత్వం ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయడం ఆశ్చర్యపరిచిందన్నారు. దేశ భద్రత అంశంలో మనకు మనదేశమే ప్రాధాన్యమన్నారు.




## అమెరికాలో మంచు తుపాను..
# ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు

అమెరికాలో మంచు తుపాను కారణంగా వేలాది విమాన సర్వీసులకు అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో జనవరి 25, 26 తేదీల్లో న్యూయార్క్, నెవార్క్‌కు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఈ మేరకు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. ''మంచు తుపాను కారణంగా న్యూయార్క్, న్యూజెర్సీలతోపాటు సమీప ప్రాంతాల్లో జనవరి 25, 26 తేదీల్లో భారీ మంచు కురుస్తుందని అంచనా. ఇది విమాన కార్యకలాపాలపై గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు, సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ రెండు రోజుల్లో న్యూయార్క్, న్యూజెర్సీలకు రాకపోకలు సాగించే ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు చేస్తున్నాం. ఈ తేదీల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకున్న వారికి సాయం చేసేందుకు మా సిబ్బంది అందుబాటులో ఉంటారు'' అని ఎయిరిండియా అడ్వైజరీలో పేర్కొంది.

# రాత్రికి రాత్రే.. 10 టన్నుల స్టీల్ వంతెన చోరీ




రాత్రికి రాత్రే.. 10 టన్నుల స్టీల్ వంతెన చోరీకి గురైన ఘటన ఛత్తీస్‌గఢ్ లోని కోర్బా జిల్లాలో చోటుచేసుకుంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోర్బా నగరంలో నాలుగు దశాబ్దాల క్రితం ధోధిపారా ప్రాంతంలోని హస్డియో ఎడమకాలువపై 70 అడుగుల పొడవైన ఉక్కు వంతెనను నిర్మించారు. ఈ వంతెన బరువు 10 టన్నులకు పైనే ఉంటుంది. జనవరి 18న ఉదయం నిద్ర లేచిన స్థానికులకు కాలువపై స్టీల్ వంతెన కనిపించకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. ముందురోజు రాత్రి వరకు ఉన్న వంతెన తెల్లవారేసరికి మాయమైపోవడంతో ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జనవరి 17న రాత్రి సమయంలో గుర్తుతెలియని 15 మంది దుండగులు గ్యాస్ కట్టర్లను ఉపయోగించి వంతెన రెయిలింగ్‌లను కట్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. రెయిలింగ్‌లను నిందితులు స్క్రాప్‌గా విక్రయించినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. స్టీల్ విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో దొంగిలించినట్లు తమ కస్టడీలో ఉన్న నిందితులు అంగీకరించారన్నారు. ఏడు టన్నుల ఉక్కును కాలువలో దాచినట్లు వారు ఇచ్చిన సమాచారంతో కాలువలో ఉన్న రెయిలింగ్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉక్కును రవాణా చేయడానికి ఉపయోగించిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని.. మిగిలిన సామగ్రిని ఎక్కడ విక్రయించారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.



## దారుణం..
# మృతదేహాన్ని కిలోమీటర్లు ఈడ్చుకెళ్లిన కారు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుదౌన్‌లో దారుణం చోటు చేసుకుంది. కారు కింద చిక్కుకుపోయిన మృతదేహాన్ని ఓ వ్యక్తి కిలోమీటర్లకు పైగా ఈడ్చుకెళ్లాడు. పక్కన వెళ్తున్నవారు చూసి వాహనం ఆపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి సదర్ కొత్వాలి ప్రాంతంలో వెళ్తున్న ఓ కారు కింద వ్యక్తి మృతదేహం ఇరుక్కుపోయి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే కారును ఆపి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారు నడుపుతున్న పర్వేంద్ర ప్రతాప్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహం కారు కింద ఎలా చిక్కుకుందో తనకు తెలియదని అతడు విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. కారు ఆపడానికి 8 కిలోమీటర్లకు ముందు తన కారుకు ఏదో ఢీకొన్నట్లు అనిపించిందని.. కానీ దిగి చూద్దామంటే వర్షం వల్ల సరిగ్గా కనపడలేదని అతడు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం ఎక్కడ జరిగింది? మృతదేహం కారు కింద ఎలా చిక్కుకుంది? అనే వివరాలు తెలుసుకోవడానికి సీసీ కెమెరాల ఫుటేజీలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. మృతుడిని బిల్సి ప్రాంతానికి చెందిన ఘరేంద్ర కుమార్ సింగ్‌గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# శబరిమల ఆలయంలో సినిమా షూటింగ్ వివాదం



శబరిమల ఆలయం మరోసారి వార్తల్లో నిలిచింది. ఆలయ సన్నిధానంలో సినిమా షూటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు స్పందించింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. శబరిమల ఆలయంలో సన్నిధానం ప్రాంతంలో మలయాళ దర్శకుడు అనురాజ్ మనోహర్ వీడియోగ్రఫీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై టీడీబీ అధికారిక ప్రతినిధి స్పందించారు. ''వీడియోగ్రఫీకి అనుమతి కావాలని మనోహర్ బోర్డును కోరినా అందుకు అనుమతి లభించలేదు. శబరిమల యాత్ర సీజన్‌కు ముందు గుర్తింపు ఉన్న మీడియా వ్యక్తులకు మాత్రం అనుమతి ఉంటుంది. ఈ షూటింగ్ వ్యవహారంపై ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు ప్రారంభిస్తాం. డైరెక్టర్ ఎక్కడ షూటింగ్ చేశారో మాకు తెలియదు'' అని వెల్లడించారు. తాను సన్నిధానం ప్రాంతంలో వీడియో తీయలేదని, పంపానది వద్ద తీశానని డైరెక్టర్ చెప్పారు. ముందస్తు అనుమతి లేకుండా సన్నిధానం వద్ద సినిమా షూటింగ్, వీడియోగ్రఫీ చేయడం నిషిద్ధం.

# బంగ్లాదేశ్ నుంచి అక్రమ రవాణా.. 2,600 కేజీల వక్కపొడి పట్టివేత



బంగ్లాదేశ్ నుంచి జరుగుతున్న అక్రమ రవాణాను భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది అడ్డుకున్నారు. చేపల పడవలో 2,600 కేజీల వక్కపొడిని తరలిస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది దాడి చేసి పట్టుకొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్ నుంచి పడవలో అక్రమంగా వక్కపొడిని తరలిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. వెంటనే సిబ్బందిని అక్కడికి పంపగా.. లక్ష్మీనారాయణ్ అనే పేరుతో ఉన్న చేపల పడవను వారు గుర్తించారు. అప్రమత్తమైన సిబ్బంది పడవలో తనిఖీలు చేపట్టగా ఒక్కొక్కటి 50 కేజీల బరువున్న 52 వక్కపొడి బ్యాగ్‌లు అందులో లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ కోసం సరకు తీసుకొచ్చిన పడవను ఫ్రేజర్‌గంజ్‌లోని కోస్ట్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు వివరించారు.

# బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో 111వ సినిమా

## మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్



**టాకీస్:** నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బడ్జెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బడ్జెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైన అనుపమ 'లాక్‌డౌన్'..



**టాకీస్:** మలయాళ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్ థ్రిల్లర్ 'లాక్‌డౌన్' ఎట్టకేలకు విడుదల తేదీని ప్రకటించింది. ఏఆర్ జీవా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం గతేడాదే విడుదల కావాల్సి ఉన్నా, తమిళనాడులో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలు మరియు కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ సినిమా కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. 'ప్రతి నిరీక్షణ వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది' అనే సందేశంతో ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అనుపమ 'అనిత' అనే మధ్యతరగతి యువతిగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనుంది. కరోనా లాక్‌డౌన్ కాలంలో సామాన్యులు ఎదుర్కొన్న చేదు అనుభవాలు, ముఖ్యంగా ఒక యువతి ఒంటరిగా క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొంది అనే యదార్థ గాథ ఆధారంగా ఈ సినిమాను మలిచారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, నాయికా ప్రాధాన్యత ఉన్న ఈ చిత్రం అనుపమ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




MOVIE TIME

# ఏప్రిల్ 10న స్వయంభు విడుదల




**టాకీస్:** యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

# 29న నెట్‌ఫ్లిక్స్‌లోకి ఛాంపియన్




**టాకీస్:** తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ప్లిక్స్' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.

# దురంధర్‌ను మించిన బోర్డర్-2

**టాకీస్:** దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.




# బాలీవుడ్‌పై ప్రత్యేక దృష్టి సారించిన మిల్కీబ్యూటీ

టాకీస్: దక్షిణాది చిత్ర పరిశ్రమలో మిల్కీబ్యూటీ తమన్నా కెరీర్ ఎలా సాగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. తెలుగు, తమిళ చిత్రాల్లో తనదైన ముద్ర వేసింది. 'హ్యాపీడేస్' సినిమాతో వెలుగులోకి వచ్చిన అమ్మడు రెండు భాషల్లోనూ సుదీర్ఘ ప్రయాణాన్ని కొనసాగించింది. దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించింది. హీరోయిన్ అవకాశాలే కావాలని కూర్చోలేదు. వచ్చిన పాత్రలతో సంతృప్తిచెందింది. ఈ క్రమంలో ఐటం భామగాను అవతారం ఎత్తింది. అక్కడా తనదైన ముద్ర వేసింది. తమిళ, తెలుగు సినిమాలతో పాటు సెకెండ్ ఇన్నింగ్స్ లో హిందీలోనూ బాగానే నటించింది. అయితే కొత్త ఏడాదిలో అమ్మడు కెరీర్ కొత్తగా ప్లాన్ చేస్తోందట. సౌత్ సినిమాలు తగ్గించి బాలీ వుడ్ లో సీరియస్ గా పని చేయాలని నిర్ణయించు కుందట. ఒకే సారి మూడు భాషల్ని మ్యానేజ్ చేయడం కష్టంగా ఉండటంతో.. బాలీవుడ్ కి దూరమవుతున్నాననే ఆలోచన నుంచి అమ్మడు మనసు మారినట్లు ప్రచారం జరుగుతోంది. సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్న ఓ సినిమాతో పాటు.. కరీనా కపూర్ క్రూ 2, గోల్మాల్ 5, మడాక్ ఫిలిమ్స్ హారర్ కామెడీ యూనివర్స్ లో భాగమవ్వాలని ప్రయత్నాలు చేస్తోందట. ఇప్పటికే ఆ చిత్రాల దర్శక, నిర్మాతలకు టచ్ లోకి వెళ్లిందట. ఈ నేపథ్యంలోనే కార్తీక్ ఆర్యన్ నటిస్తోన్న నాగ్ జిల్లా ప్రాజెక్ట్ ను కావాలనే వదులకుందట..

# రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల




**టాకీస్:** సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలొడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్- నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.